క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



కవిటిలో అశోక్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

కవిటి/సోంపేట: రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా సొంతూరుకు వచ్చిన ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్‌కు ఆదివారం అభిమానులు, పార్టీశ్రేణులు ఘనస్వాగతం పలికారు. సోంపేట మండలం కొర్లాం జంక్షన్ నుంచి ఆయనకు భారీ వాహనశ్రేణితో స్వాగతం పలికి ర్యాలీగా కంచిలి, సోంపేట మండలాల మీదుగా ర్యాలీ కొనసాగి స్వగ్రామం రామయ్యపుట్టుగకు చేరుకున్నారు. పలువురు తహసీల్దార్లు, పోలీసు అధికారులు, ఎంపీడీవోలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అశోక్ తన కుటుంబసభ్యులతో గ్రామదేవత చింతామణి అమ్మవారిని దర్శించుకున్నారు.

108 వాహన సిబ్బంది నిరసన



టెక్కలిలో నిరసన చేస్తున్న 108 వాహన ఉద్యోగులు

టెక్కలి: తమ డిమాండ్లను పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలను ఉద్ధృతం చేస్తామని 108 వాహన ఉద్యోగులు హెచ్చరించారు. టెక్కలికి చెందిన 108 ఉద్యోగులు ఆదివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం నుంచి సమ్మె బాట పడుతున్నామని పేర్కొన్నారు. 108 వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా కొనసాగించాలని, గతంలో ఉన్న జీవో 49ను పునరుద్ధరించాలని, ఎన్నిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా 5కే రన్ పోటీలు



విజేతలతో రోటరీక్లబ్ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: పట్టణంలో 5 కే రన్ పోటీలు ఉత్సాహంగా ఆదివారం జరిగాయి. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో బాలురుకి 5కే రన్, బాలికలకు 3కే రన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలురు విభాగంలో సీహెచ్ కుషాల్(లొద్దపుట్టి), ఎన్.సతీష్ (ఇచ్ఛాపురం), ఎల్.నాని (ఈదుపురం) బాలికల విభాగంలో బి.బేబి (ఈదుపురం), పి.అమృత (ఇచ్ఛాపురం), బి.భవాని (ఇచ్ఛాపురం) లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు రాజ్‌కుమార్ రోటరీ ప్రతినిధులు ఉన్నారు.

సౌత్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఝాన్సీరాణి



టెక్కలి: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి జరగనున్న సౌత్ జోన్ అంతర్ వర్సిటీ మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.ఝాన్సీరాణి ఎంపికై ంది. ఈ విషయాన్ని ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న ఝాన్సీరాణిని వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, అధ్యాపకులు వి.ల్యూక్‌పాల్, పీడీ సత్యన్నారాయణ, కోచ్ వి.ఈశ్వరరావు అభినందించారు.

తులసమ్మకు పూజలు



తులసమ్మ ఆలయం వద్ద భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలోని ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాలతో పాటు ఒడిశాలోని సుమండీ, సామంతపల్లి, పాత్రపురం, రొంపా గ్రామాలకు చెందిన భక్తులు మేళ తాళాలు, కోయ నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఘనంగా ఊరేగించి, మొక్కులు చెల్లించుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన కాళ్ల హరిబాబు (67) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. హరిబాబు రిక్షా తొక్కుతూ వచ్చే ఆదాయంతో జీవిస్తుండేవాడు. ఈ నెల ఏడో తేదీ రాత్రి తన ఇంటి వద్ద రిక్షా ఆపి దిగుతుండగా పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి మేరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ హరిబాబు ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమార్తె హేమలత ఫిర్యాదు మేరకు టెక్కలి పోలీసులు కేసునమోదు చేశారు.

ధాన్యం కొనేదెప్పుడు?



- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం!
- రైతులకు గాలం వేస్తున్న దళారులు
- ముమ్మురంగా వరికోతలు

టెక్కలి సమీపంలోని పొలంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

టెక్కలి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో టెక్కలి నియోజకవర్గంలో జాప్యం నెలకుంది. అధికారులు ఇప్పటి వరకూ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై దృష్టిసారించలేదు. దీంతో దళారీలు రైతులకు గాలం వేస్తున్నారు. పూర్తిస్థాయిలో వరికోతలు కాలేదనే కారణంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. అలాగే పొలాల్లో ధాన్యం రాశులు ఉండడం కనిపిస్తోంది. దీంతో అప్పుడే దళారులు రైతులను ఆశ్రయించి దగా చేయాలని చూస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. అయితే ఈసారి రైతు సేవా కేంద్రం ద్వారా రైతులు అమ్మకాలు చేయాలనే నిబంధనలు తీసేశారు. మద్దతు ధర వస్తే మిల్లర్లు, బయట ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద అమ్మకాలు చేసుకోవచ్చనే ప్రభుత్వ నిబంధనలు రైతులకు మంచి చేస్తాయో.. నష్టం కలిగిస్తాయో..ఎటు వైపు దారి తీస్తాయో వేచి చూడాలి. ఖరీఫ్ సీజన్‌లో టెక్కలి నియోజకవర్గంలో సుమారు 84,046 ఎకరాల్లో వరి సాగుకు పది శాతం మినహాయిస్తూ సుమారు 1,70,539 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తదితర మండలాల్లో ఒక వైపు ముమ్మరంగా వరికోతలు జరుగుతున్నాయి.

దళారుల దోపిడీ కోసమే జాప్యం



ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో జరుగుతున్న జాప్యం కేవలం మిల్లర్లు, దళారులకు లాభం కలిగించడానికే అనే అనుమానం వస్తోంది. ఇప్పటికే కొంతమంది దళారులు రైతులను ఆశ్రయించి దగా చేయాలని చూస్తున్నారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలి.

–సత్తారు సత్యం, పీఏసీఎస్ మాజీ ఛైర్‌పర్సన్, టెక్కలి



నందిగాం మండలం దిమిలాడలో కళ్లాల్లో నెట్టలు వేసి ఉన్న ధాన్యం బస్తాలు

ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదు



రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. బయట కనీస మద్దతు ధర ఉంటేనే అమ్మకాలు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అంతా సిద్ధం చేశాం. వరి కోతలు పూర్తయితే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేస్తాం . ఈ విషయంలో దిగువ స్థాయి అధికారులతో గట్టి చర్యలు చేపడుతున్నాం. ధాన్యం అమ్మకాలు చేసిన 48 గంటల్లోనే రైతులకు డబ్బులు జమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

–ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

మద్దతు ధర ఇలా..

	క్వింటాకు	80 కేజీలకు	40 కేజీలకు
గ్రేడ్ ఏ రకం	రూ.2,320	1,856	రూ.928
సాధారణ రకం	రూ. 2,300	1,840	రూ.920

పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు

పలాస: మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న చిరుద్యోగులకు పనిభారం పెరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లారి నారాయణరావు డిమాండ్ చేశారు. అలా పదోన్నతులు కల్పించాలని, ప్రతి కార్యాలయంలో ఒక సీనియర్ సహాయకున్ని నియమించాలని కోరారు. ఈ మేరకు వారు పలాస మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయాల్లో కింది స్థాయి సిబ్బందికి పని భారం అధికమైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని తగ్గించడానికి అదనంగా ఒక సీనియర్ సహాయకున్ని నియమించాలని.. అందుకు పదోన్నతలు కల్పించాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె.నర్సింహమూర్తి, బి.వి.ఆర్ ప్రసాదరావు, కొర్ల మన్మథరావు, లండ శ్రీనివాసరావు, కె.మురళీకృష్ణ, తమ్మినాయుడు, పార్వతి, ఏవో అనురాధ ఉన్నారు.

గణిత ప్రతిభ పరీక్షకు విశేష స్పందన



టెక్కలి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం: ఒడియా గణిత ప్రశ్న పత్రాన్ని విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షకు విశేష స్పందన లభించింది. సుమారు 71 మంది విద్యార్థులు హాజరై తమ గణిత ప్రతిభను నిరూపించారు. అనంతరం మండల విద్యా శాఖాధికారి డి.తులసీరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చిలుకు కృష్ణారావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు భాస్కరరావు, నరేష్, రుషి, హేమసుందర్, జానకీరామ్, అప్పారావు, మురళీకృష్ణ, శైలజ, స్వర్ణలత, చంద్రోఖర్ ఉన్నారు.

ఇచ్ఛాపురం: సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి ప్రతిభ పరీక్షను స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో ఒడియా విద్యార్థులకు నిర్వహించారు. 7, 8, 9, 10వ తరగతుల విద్యార్థులు 120 మంది హాజరయ్యారు. గణిత ఉపాధ్యాయులు మధు, ప్రశాంత్‌లిమ్మాయ్, త్రిలోచనరావు, ఒబిబెహర, అరుణ, రేణుక, ధర్మరాజు ఉన్నారు.

ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలి

పలాస: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్ నాలుగో తేదీన విజయవాడలో నిర్వహించే ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు కోరారు. ఈ మేరకు పలాస మండలం బొడ్డపాడులోని జిల్లా అమర వీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రధానమైన విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, దీని అభివృద్ధికి తగిన వనరులను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ సీనియర్ సభ్యులు మద్దిల మల్లేశ్వరరావు, దుశ్యంతు, అప్పారావు, కామేశ్వరరావు, అప్పయ్య, ఈశ్వరమ్మ ఉన్నారు.

ఉపాధ్యాయుడుకి సత్కారం



కృష్ణారావు దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లి గ్రామానికి చెందిన దున్న పుష్పలత మూడు తులాల బంగార అభరణాన్ని పోగొట్టుకుంది. ఇది మామిడిపల్లి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు ఎస్.వి.కృష్ణారావుకు లభ్యమైంది. దీన్ని పుష్పలతకు అందజేసి నిజాయితీని చాటుకున్నారు. దీంతో కృష్ణారావు, మోహిని దంపతులను బైపల్లి గ్రామస్తులు ఆదివారం సన్మానించి అభినందించారు. రూ. 2.50 లక్షల విలువైన బంగారాన్ని బాధితులకు అందించి నిజాయితీ చాటుకున్న కృష్ణారావు మాస్టార్ నేటి సమాజానికి ఆదర్శనీయులని కొనియాడారు. గ్రామ పెద్దలు, బాధిత కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు ధర్మారావు, సత్యం, తిరుపతి, డి.లక్ష్మణ్, డి.రమేష్, పూజా, షణ్ముఖరావు, భారతమ్మ ఉన్నారు.

ఏసీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు



అసోసియేషన్ కార్యవర్గం

కాశీబుగ్గ:

పలాస-కాశీబుగ్గ ఏసీ (ఎయిర్‌కండీషన్) టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆదివారం కాశీబుగ్గ శారదామాత ఆశ్రమం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా డొక్కర మాధవరావు, ఉపాధ్యక్షుడుగా మర్రి వేణుగోపాలరావు, సెక్రటరీగా కూన జనార్దనరావు, జాయింట్ సెక్రటరీగా సిగ్గిలిపల్లి లోక్‌నాథ్, ట్రెజరర్‌గా మామిడి బాలరాజు, కార్యవర్గ సభ్యులుగా బత్తిని సంతోష్, సనపల సురేష్, బసవల తరుణ్‌కుమార్, సలహాదారులుగా బోనెల పవన్‌ప్రసాద్, కొవ్వూరు ఉదయ్‌శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా ఎన్‌సీసీ డే



కార్యక్రమంలో ఎన్‌సీసీ కేడెట్లు

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్‌లు నిర్వహించిన మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. హెచ్‌ఎం ఎన్‌సీసీ విశిష్టతను వివరించారు. ఎన్‌సీసీ ఇన్‌చార్జి తేజేశ్వరరావు, ఉపాధ్యాయులు కూర్మయ్య, త్రిలోచన్, మధు, పద్మజ, గణేష్, హీరమణి, మల్లేష్, శారద, గణేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



క్రాంతినగర్‌లో నారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కంచిలి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. తలతంపరకు చెందిన కుమారి బిసాయి కిడ్నీ వ్యాధితో, సువాగడ పంచాయతీ క్రాంతినగర్‌కు చెందిన కుంబిసి నారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ రెండు కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, తలతంపర ఎంపీటీసీ సభ్యుడు బృందావన్‌సాహు, సువాగడ సర్పంచ్ సబితా గొమాంగో, ప్రకాశ్ పండా పరామర్శించారు.

పట్టుశాలి సంఘం నూతన కార్యవర్గం



భావన మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్యవర్గ సభ్యులు

టెక్కలి: పట్టుశాలి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం సంక్షేమ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షునిగా దుంపా లోకేశం, అధ్యక్షునిగా మలిపెద్ది మధుసూదనరావు, ఉపాధ్యక్షునిగా బుడ్డు భుజంగరావు, ప్రధాన కార్యదర్శిగా దుంపా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా బుడ్డు నందికేశ్వరరావు, కోశాధికారిగా కొండేటి అచ్యుతరావును ఎన్నుకున్నారు. అనంతరం విశ్రాంత ఇంజినీర్ పమ్మిన సింహాచలాన్ని సన్మానించారు. అంతకు మునుపు భావన మహర్షి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.శ్యామ్‌సుందర్, డి.సాంబశివరావు, పి.సోమేశ్వరరావు, ఎ.వెంకటేష్, ఎం.దినేష్ పాల్గొన్నారు

రైతులకు అవగాహన..



వరిని ఆశిస్తున్న రెల్లరాల్చు పురుగుల నివారణపై వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సత్తిబాబు, కిశోర్ పర్యవేక్షణలో జిల్లాకు చెందిన సైకాస్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు టెక్కలి మండలంలోని పలు గ్రామాల్లో క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా వరిలో రెల్లరాల్చు పురుగుల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. క్షేత్ర పర్యటనలో విద్యార్థులు జి.తరుణ్‌కుమార్, ఎ.గోపిచంద్, ఎం.దీరజ్, బి.ధనుంజయ, కె.వి.ప్రతాప్ ఉన్నారు.

–టెక్కలి

తీరంలో సందడి..



వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ప్రస్తుతం వనభోజనాల సీజన్ కావడంతో ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు టెక్కలిపట్నం , పలాస, కాశీబుగ్గ, గొప్పిలి గ్రామాల నుంచి పర్యాటకులు కుటుంబ సభ్యులు, స్నేహితులతో తీరానికి చేరుకున్నారు. దీంతో శివసాగర్ తీరం జనసంద్రంగా మారింది. తీరం పరిసర తోటలలో పర్యాటకులు వనభోజనాలు చేసి అనంతరం బీచ్‌లో ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మెరైన్, స్థానిక పోలీసులు పర్యాటకులను అప్రమత్తం చేశారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

సేవా సంస్థ వార్షికోత్సవం..



పలాస మండలం గొల్లమాకన్నపల్లి గ్రామానికి చెందిన స్వామి వివేకానంద సేవా సంస్థ ఆరో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు ఆరేళ్ల క్రితం సంస్థను యువకులు బన్నీ, ధర్మా, కిరణ్‌లు స్థాపించారు. అప్పటి నుంచి ఆ సంస్థలోకి వందలాది మంది యువకులను చేర్చుకుంటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల చేత మన్ననలను అందుకుంటున్నారు. హైస్కూల్ స్థాయి విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన పలాస, లోహరబంద, గురుదాసుపురం విద్యార్థులకు వరుసగా ప్రథమ , ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేశారు. ప్రజా కవి, గాయకుడు కుత్తుం వినోద్‌ను సత్కరించారు. స్థానిక నాయకుడు కోరాడ ధనరాజు, ఉపసర్పంచ్ రాపాక పురుషోత్తం, గ్రామ పెద్దలు రాపాక కూర్మారావు, రాపాక చిన్నారావు, కోరాడ లింగమూర్తి, సాగర్, పున్నయ్య మాస్టారు, ఫుడ్ బ్యాంకు ప్రతినిధులు ఉన్నారు.

–పలాస

నూతన కార్యవర్గం..



వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి గ్రామంలో ఆదివారం వాడబలిజ కుల సేవాసంఘ నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. అధ్యక్షులుగా చీకటి కామేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కోనేరు కామేశ్వరరావు, కార్యదర్శిగా మద్దు సుధీర్, సంయుక్త కార్యదర్శిగా కె.పాపారావు, కోశాధికారి బొంపల్లి శివకుమార్, గౌరవ అధ్యక్షులుగా మద్దు లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాడబలిజ సంఘాన్ని మరింత బలోపేతం చేసి కుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు స్థానికులు అభినందనలు తెలియజేసారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

ప్రమాదం అంచున ప్రయాణం!



పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రమాదకరమైన ప్రయాణాలు తగ్గడం లేదు. వజ్రపుకొత్తూరు, నువ్వలరేవు, నగరంపల్లి, అక్కుపల్లి, డోకులపాడు, పల్లిసారధి, బెండి గేట్, కొండవూరు రోడ్లలో ప్రైవేట్ వాహనదారులు అత్యాశతో పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించుకొని గుంతలు పడ్డ రోడ్డులపై ప్రయాణం చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లే చిన్నారులను అధికంగా ఆటోలలో కిక్కిరిసి ఎక్కుస్తున్నారు. దీంతో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని చూసేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలను అరికట్టాలని కోరుతున్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్

.26న రైతు పోరుబాట



మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: రైతు, కార్మిక చట్టాలు, వారి హక్కుల సాధన కోసం పలాస ఆర్డీవో కార్యాలయం ఈ నెల 26న చేపట్టనున్న రైతు పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘ జిల్లా కమిటీ సభ్యులు కె.బాలజీ, సూధన్ కోరారు. ఈ మేరకు నువ్వలరేవు, చినవంక, వజ్రపుకొత్తూరు, బెండి గ్రామాల్లో ఆదివారం ప్రచార కార్యక్రమం చేపట్టారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు



అసంపూర్తిగా ఉన్న రోడ్డు

కంచిలి: మండల కేంద్రంలోని మఠంకంచిలి నుంచి బలియాపుట్టుగ గ్రామానికి జాతీయ రహదారి కూడలి వరకు ఉన్న రోడ్డులో సిమెంటు రోడ్డును అసంపూర్తిగా నిర్మించారు. ఈ మార్గంలో సగం భాగం మాత్రమే సీసీ రోడ్డు నిర్మించి, మిగతా భాగాన్ని విడిచిపెట్టేశారు. జాతీయ రహదారి నుంచి మండల కేంద్రం కంచిలిలోకి రావడానికి ఉండే ముఖ్యమైన మార్గం ఇదే. కానీ దీని అభివృద్ధిపై నిర్లక్ష్యం చేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వెంటనే దీన్ని పూర్తిస్థాయిలో నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా భావప్రచార కార్యక్రమం



మాట్లాడుతున్న స్వామిజీలు

కాశీబుగ్గ: పలాస మండలం మోదుగులపుట్టి గ్రామంలో ఆదివారం శ్రీరామకృష్ణ, వివేకానంద భావ ప్రచార కార్యక్రమం 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నిర్విషయానంద మహారాజు, భద్రాచలం రంగారావు మాస్టారు, దువ్వాడ సుబ్బలక్ష్మిలు హాజరై ఉపన్యసించారు. అంతకుముందు నగరసంకీర్తన, అష్టోత్తర శతనామ, కథామృతం, భజన, ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమం శ్రీరామకృష్ణా సేవా సమితి, మోదుగులపుట్టి, బంజీరుపేట గ్రామస్తు ఆధ్వర్యంలో జరిగింది.